## క్లుప్తంగా

### వీరేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకాభిషేకాలు చేస్తున్న భక్తులు

ఐ.పోలవరం: సంపూర్ణ చంద్రగ్రహణం ముగిసిన తరువాత రోజు కావడంతో సోమవారం మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం కావడంతో గ్రహణ దోష జాతకులు ఆలయానికి వచ్చి దోష పరిహారానికి అభిషేకాలు, దానాలు ఇచ్చారు. ఉదయం 8 గంటలకు ఆలయ పండితులు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతి ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు విరాళం

మురమళ్ల: వీరేశ్వర అన్నదాన ట్రస్టుకి అమలాపురం వాస్తవ్యులు కొమ్మూరి భాను శ్రీనాగ వెంకటమణిసాయి ఆకాష్ రూ. 11,116 సోమవారం అందించారు. ఈ సందర్భంగా మురమళ్లలోని వీరేశ్వర ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో దాతకు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. దాతను ఆలయ కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ అభినందించారు.

### వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయినకు సత్కారం



చెల్లుబోయినను సత్కరించి అభినందిస్తున్న పి.గన్నవరం పార్టీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన చెల్లుబోయిన శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పార్టీ పరిశీలకునిగా నియమితులైన సందర్భంగా ఆయనను పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ నాయకులు స్థానిక సూర్యనగర్‌లో సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సత్కార కార్యక్రమం నిర్వహించారు. అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కోనసీమ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, అంబాజీపేట మండల పార్టీ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ తదితరులు శ్రీనివాసరావును సత్కరించి అభినందించారు.

### ప్రజారోగ్యానికి చంద్రబాబు మరణ శాసనం

తాళ్లరేవు: ఆరోగ్యశ్రీని బీమా కంపెనీలకు అప్పగించడం, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయాలన్న నిర్ణయం ప్రజారోగ్యానికి మరణ శాసనమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి సంతోష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయానే లక్ష్యంతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతోమందికి ప్రాణభిక్ష పెట్టారన్నారు. వైఎస్ మరణానంతరం ఆరోగ్యశ్రీని ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీకి పెద్దపీట వేసి మరిన్ని జబ్బులకు చికిత్స పొందేలా పథకాన్ని విస్తృతం చేశారని అన్నారు. ఆయన హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తీసుకువచ్చి రూ.8,500 కోట్లు వాటికోసం విడుదల చేశారని కొనియాడారు. చంద్రబాబు ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాల తీసుకురాకపోగా జగన్ నిర్మించతలపెట్టిన వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటని సంతోష్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

### చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

ముమ్మిడివరం: మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారికాధికారి వై.విజయశ్రీ సూచించారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం మిషన్ శక్తి (సంకల్ప)పై అంగన్‌వాడీ కార్యకర్తలకు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలకు అందించే వైద్య న్యాయ, రక్షణ, ఆశ్రయం, సైబర్ నేరాల నుంచి రక్షణ, నైపుణ్యాభివృద్ధి, బాల్యవివాహాలు, పీఓఎస్‌సీఓ చట్టాలపై అవగాహన కల్పించారు. వీటిపై మరింత అవగాహన పెంచుకొని గ్రామాల్లో మహిళలకు సేవలను చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నిహారిక, అంబికాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఛిద్రమైన తాళ్లరేవు మండలం జి.వేమవరం ప్రధాన రహదారి



బురదమయంగా సలాదివారిపాలెం పుంత రోడ్డు

# దారి చూపేవారేరీ!

- అధ్వానంగా రహదారులు
- వాహనచోదకులు, విద్యార్థుల అవస్థ
- వర్షం నీరు గోతుల్లోకి చేరడంతో ప్రమాదాలు

ముమ్మిడివరం: గ్రామీణ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం వస్తే రహదారులు చిత్తడిగా మారి ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. నియోజకవర్గంలో 67 గ్రామ పంచాయతీల్లో రహదారుల దుస్థితి మరీ దారుణంగా ఉంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై భారీ గోతులు ఏర్పడి వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారులపై ద్విచక్ర వాహన చోదకులు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని గ్రామాల ప్రజలు మండల కేంద్రాలకు చేరుకోవాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల దారుణంగా ఉంది.

**ఛిద్రమైన రోడ్డు**

నియోజకవర్గంలోని ముమ్మిడివరం మండలంలోని గాడిలంక పంచాయతీ పరిధిలో పల్లాలమ్మ కాలనీ నుంచి 216 జాతీయ రహదారి వరకు ఉన్న జెడ్పీ రహదారి అధ్వానంగా తయారైంది. పదేళ్ల క్రితం జెడ్పీ నిధులతో నిర్మించిన ఈ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమైంది. సుమారు కిలోమీటరు దూరం ఉన్న ఈ రహదారే గ్రామస్తులు జాతీయ రహదారికి చేరుకునేందుకు ప్రధాన మార్గం. ఈ రహదారి అధ్వానంగా తయారవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**అత్యవసర వైద్యసేవలకు ఆటంకం**

బొబ్బర్లంక- పల్లంకుర్రు ప్రధాన పంట కాలువ గట్టుపై కర్రివానిరేవు దుర్గమ్మ గుడి నుంచి చింతావాని రేవు వరకు రహదారి అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా తయారైంది. కర్రివానిరేవు, చింతావానిరేవు, మర్లపాలెం గ్రామ ప్రజలు జాతీయ రహదారి చేరుకునేందుకు ఈ రహదారి ఒక్కటే మార్గం. దీంతో కొద్దిపాటి వర్షానికే ఈ రహదారిలో ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. అత్యవసర వైద్యసేవలు పొందాలంటే ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. సలాదివారిపాలెం- శేరుల్లంక, కమిని పంచాయతీ పరిధిలోని సలాదివారిపాలెం- శేరుల్లంక రహదారి శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. తాళ్లరేవు మండలం జి.వేమవరం ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారైంది. ఈ రహదారి 216 జాతీయ రహదారి అనుకుని ఉండటంలో సమీప జిల్లా కేంద్రమైన కాకినాడ వెళ్లేందుకు ఆయా పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలో సీతారామ పురం ప్రధాన రహదారి ఇటీవల వర్షాలకు ముంపుకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీ వ్యవస్థలేక పోవడంతో ముంపు బారిన పడుతున్నారు. దీంతో ఆయా గ్రామ పజలు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు.

**రహదారుల అభివృద్ధి పనులు చేపట్టాలి**



మండలంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా సుంకరపాలెం, జి.వేమవరం తదితర గ్రామాల్లో రహదారులు ఛిద్రమవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలి.

– పందిరిపల్లి రాజేష్, నీలపల్లి

**పుంత రోడ్లను ఆధునీకరించాలి**



గ్రామంలో పుంత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొద్దిపాటి వర్షానికే ముంపు బారిన పడి రోడ్లన్నీ బురదమయంగా తయారవుతున్నాయి. రోడ్లపై నడవాలంటేనే నరక యాతన పడుతున్నాం. పుంత రోడ్లకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

– సలాది సత్యనారాయణ, సలాదివారిపాలెం

# అన్నదాత పోరును విజయవంతం చేయండి

అమలాపురం రూరల్: ప్రభుత్వం యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తున్నందుకు నిరసనగా మంగళవారం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో చేపట్టే అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ నియోజకవర్గ సీపీ కోర్డినేటర్ పినిపే డాక్టర్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. భట్నవెల్లిలో మాజీ మంత్రి నివాసంలో సోమవారం అమలాపురం రూరల్ మండలం వైఎస్సార్ సీపీ అధ్వర్యంలో అన్నదాత పోరు పోస్టర్లను శ్రీకాంత్ పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ మాజీ మంత్రి విశ్వరూప్ నివాసం వద్ద మంగళవారం ఉదయం 9 గంటల నుంచి రైతు పోరుకు నాయకులు. రైతులు, కార్యకర్తలు ఆర్డీవో కార్యాలయాలనికి బైక్ ర్యాలీగా తరలి వెళ్లాలన్నారు. రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, జిల్లా అధికారి ప్రతినిధి సుధాగణపతి, జిల్లా మాజీ కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీనివాసరావు నాయకులు దాసరి డేవిడ్, యిళ్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

**వాల్ పోస్టర్ ప్రదర్శన**

అల్లవరం: వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో అల్లవరంలోని ఆయన నివాసంలో అన్నదాత పోరుపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ భట్నవిల్లిలోని నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ నివాసం నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లి యూరియా కొరతపై నిరసన తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి నరసింహరావు, సీనియర్ నాయకులు తిక్కా ప్రసాదు, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, గ్రామకమిటీ అధ్యక్షులు కుడుపూడి సూర్యప్రకాశరావు, రైతు నాయకులు నిమ్మకాయల శేఖర్, గోసంగి వెంకటేశ్వరరావు, వాసర్ల శ్రీను, రేవు సుందరరావు, కొనుకు మహేష్, తాడి సుమంత్ పాల్గొన్నారు.

**అన్నదాత పోరును విజయవంతం చేద్దాం**

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అన్నదాతల అవస్థలకు కారణమవుతోందని అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అన్నారు. అమలాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నిర్వహించనున్న అన్నదాత పోరు నిరసనకు పట్టణంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక వాసర్ల గార్డెన్‌లో అన్నదాత పోరుకు సంబంధించి సోమవారం ఉదయం నిర్వహించిన వాల్ పోస్టర్ల విడుదల కార్యక్రమంలో బులినాని పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, కట్టోజు సన్నయ్యదాసు, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు ఉండ్రు వెంకటేష్, కుడుపూడి భరత్ భూషణ్, బండారు సత్యనారాయణ, కల్వకొలను ఉమ, విత్తనాల మూర్తి, వాసర్ల వెంకన్న, మద్దింశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొని అన్నదాత పోరును సమష్టిగా విజయవంతం చేద్దామని స్పష్టం చేశారు.



అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రూరల్ మండల పార్టీ నాయకులు



అమలాపురంలో అన్నదాత పోరు పోస్టర్లతో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు



ఉప్పలగుప్తంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



అన్నదాత పోరు పోస్టర్‌ని ప్రదర్శిస్తున్న అల్లవరం మండల వైఎస్సార్ సీపీ నేతలు

**అమలాపురంలో నేడు ర్యాలీ**

ఉప్పలగుప్తం: అమలాపురం డివిజన్ వ్యాప్తంగా మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరును కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జీ అధ్యక్షతన పార్టీ నాయకులంతా సమావేశమై సోమవారం అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేయడానికి అమలాపురం ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తామని అమలాపురం నియోజకవర్గ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడు చీకట్ల కిషోర్, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, రైతు నాయకులు రామపురెడ్డి నాగు, యాళ్ల చిన్నా, కుంపట్ల నాయుడు, కామిశెట్టి ఏసు, ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మురమళ్ల: అమలాపురంలో సెప్టెంబర్ 9న నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి వేలాదిగా రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరుకావాలని ఆపార్టీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు సోమవారం పిలుపునిచ్చారు.

**అమలాపురం తరలిరండి**

తాళ్లరేవు: రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న మంగళవారం అమలాపురంలో నిర్వహించే అన్నదాత పోరుకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలి, ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి తదితర డిమాండ్లతో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని గోవిందకుమార్ కోరారు.

### ఫిజియోథెరపీతో శారీరక ఆరోగ్యం మెరుగు



ఫిజియోథెరిపిస్టులను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: సురక్షిత వృద్ధాప్యానికి, శారీరక ఆరోగ్యానికి ఫిజియోథెరపీ, వ్యాయామం అవసరమని అమలాపురానికి చెందిన సక్షమ్ (సమ దృష్టి క్షమతా వికాసం, అనుసంధాన మండలి) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీమన్నారాయణరావు అన్నారు. స్థానిక వడ్డిగూడెవంలోని శ్రేయ ప్రత్యేక అసవసరాల విద్యార్థుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఫిజియెథెరపీ దినోత్సవ కార్యక్రమానికి డాక్టర్ శ్రీమన్నారాయణరావు అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఫిజియోథెరపీతో ఆరోగ్యకరమైన వృద్ధాప్యం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. అమలాపురానికి చెందిన ఫిజియోథెరపిస్టులు డాక్టర్ దుంగా వెంకటేశ్వరరావు, కె.నాగమానస, షేక్ నాజర్‌ను సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పేరి లక్ష్మీనరసింహం, శిష్టా శ్రీహరి, డాక్టర్ మనోహర్ సాయి, డాక్టర్ కె.అనంతలక్ష్మి, చిక్కాల నాగేంద్ర పాల్గొన్నారు.

### వైద్యరంగంలో కీలక పాత్ర

యానాం: వైద్యరంగంలో ఫిజియోథెరపీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని యానాం పరిపాలనాధికారి అంకిత్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో నైఫ్ డైరెక్టర్ బీవీ రాంకుమార్ ఆధ్వర్యంలో, సోషల్ వెల్ఫేర్, ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యేతేంద్రకుమార్, ఈడీ ఎస్పీ రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ రిఫ్కా రోషియో, శ్రీకాంత్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

తాళ్లరేవు: ఉపాధి శ్రామికులకు వేతన బకాయిలు చెల్లించాలి, మేట్లకు సదుపాయాలు కల్పించాలి తదితర డిమాండ్లతో కూలీలు సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్ పాల్గొని డీటీ సూరిబాబుకు వినతిపత్రాన్ని అందజేసారు.

### దివ్యాంగులకు అలవెన్సులు

అల్లవరం: భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అలవెన్సులను విడుదల చేసిందని జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గోడిలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల అలవెన్స్ రూ.2 వేలు, హోనీ బేస్డ్ అలవెన్స్ రూ.3 వేలు, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.3 వేలు, రవాణా అలవెన్స్ రూ.6 వేలు ఇస్తున్నామని తెలిపారు. దివ్యాంగ చిన్నారులను ప్రేమతో ఆదరించాలని ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో టి.శ్రీను, భవాని ఉన్నారు.

# దరియాలతిప్ప రక్షిత నీటి పథకం పరిశీలన

సాక్షి ఇంపాక్ట్

యానాం: నియోజకవర్గ శివారు గ్రామమైన దరియాలతిప్పలో రక్షిత నీటి పథకం దుస్థితిని వివరిస్తూ ఈనెల 7న ఆదివారం 'ఇదే మంచి నీరు..ఆధునీకరణకు దూరంగా మంచినీటి చెరువు' శీర్షికన సాక్షిలో వెలువడిన కథనానికి ఐఏఎస్ అధికారి, ఆర్ఏఓ అంకిత్‌కుమార్ స్పందించారు. ఆయన స్వయంగా దరియాలతిప్ప రక్షిత నీటి పథకాన్ని పరిశీలించారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫిల్టర్ ప్లాంట్, పిచ్చిమొక్కలు, గడ్డితో ఉన్న మంచినీటి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ ఈఈ కాళ్ల నాగరాజును మంచినీటి చెరువు దుస్థితిపై ప్రశ్నించారు. ఏళ్లు గడుస్తున్నా దరియాలతిప్ప మంచి నీటి పథకం నిర్వహణను అధికారులెవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆర్ఏఓకు ఫిర్యాదు చేశారు. దరియాలతిప్ప నుంచి సుమారు 7 తీరప్రాంత మత్స్యకార గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని చెప్పారు. కుళాయిల నుంచి తాగునీరు పసరుగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్ఏఓ అంకిత్‌కుమార్ ఆధునీకరణ పనులకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దలు సబ్బతి శ్రీనివాస్, కమిడి బాలయోగి, దాసరి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



దరియాలతిప్ప రక్షిత నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్ఏఓ అంకిత్‌కుమార్

# ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ ప్రారంభం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న హెవీ డ్రైవింగ్ స్కూల్లో 11వ బ్యాచ్‌లో 16 మంది అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. జిల్లా రవాణా అధికారి డి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.డ్రైవర్లు చాలా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి రాఘవకుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణ అవగాహన కల్పించారు. డిపో ఇన్‌చార్జి మేనేజర్ వైపీపీఎన్ కుమార్ అభ్యర్థులకు డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన పుస్తకాలను అందజేసారు. గ్యారేజ్ ఇన్‌చార్జి జీఆర్ ఎల్ దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఇంచార్జ్ ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎస్. వరహాల బాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు. త్వరలో 12వ బ్యాచ్ శిక్షణ తరగతుల ప్రారంభమవుతాయని ఆసక్తిగల అభ్యర్థులు సెల్. 7382909588 నంబరును సంప్రదించాలన్నారు.



డ్రైవర్లకు పుస్తకాలు అందిస్తున్న డీటీవో శ్రీనివాసరావు

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

ఉప్పలగుప్తం: భీమనపల్లి పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కోడూరి ధర్మారావు, యార్లగడ్డ భాస్కర్‌శాస్త్రి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. గొల్లవిల్లి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు ఎస్.నాగేశ్వరరావు, జి.కనకదుర్గ, పీఎంసీ చైర్మన్లు వాలా సత్యనారాయణమూర్తి, గుర్లింక సూర్యనారాయణమూర్తి, పీడీలు కామన మధుసూధన్‌రావు, గొలకోటి ఫణీంద్ర, డి.సరస్వతి, కరాటం ప్రసాద్, వి.విజయ భాస్కర్ పాల్గొన్నారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం**

తాళ్లరేవు: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఎంపీపీ రాయుడు సునీత సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లు, మండల ఉత్తమ ఉపాధ్యాయులు జి.రాంబాబు, డి.రతీపార్వతి, ఎం.బంగార్రాజు, పి.అప్పారావు, జి.శివశంకరంను ఎంపీపీ సునీత దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, ఎంఈఓలు ఏ.మంగాయమ్మ, మోకా ఉమ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. పోలేకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పార్వతితోపాటు గ్రామ పరిధిలో పనిచేస్తున్న 13 మంది ఉపాధ్యాయులు, ఐదుగురు అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సత్కరించి అభినందించారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భీమనపల్లిలో అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



తాళ్లరేవులో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

# వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

అమలాపురం రూరల్: వినియోగదారుల హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఫిర్యాదుల సంస్కృతిని ప్రోత్సహించకుండా పూర్తిగా నియంత్రించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వినియోదారుల మండలి సభ్యులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశం సభ్యులతో జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వినియోగదారులు హక్కుల పరిరక్షణలో మండలి సభ్యులు కీలకంగా వ్యవహరించాలన్నారు. లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి సూచించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ధరలు పట్టికలను డిపోల్లో ప్రదర్శించాలని ఆమె స్పష్టం చేశారు. వస్తు వినియోగం, సేవల రంగాల్లో చట్టపరమైన లైసెన్సులు పొంది కార్యకలాపాలు చేపట్టి విని యోగదారులకు అన్ని విధాల రక్షణ కవచంగా మండలి నిలవాలని ఆమె స్పష్టం చేశారు. కోనసీమ కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి మాట్లాడుతూ మెడికల్ అండ్ హెల్త్ శాఖ పీహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ చేయాలన్నారు. ముమ్మిడివరం ఆర్టీసీ బస్ స్టేషన్ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించకుంటే హైకోర్టులో కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో అడపా ఉదయభాస్కర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి